సాక్షి అనంతపురం

మంగళవారం । 27 । మే । 2025



చీనీ టన్ను రూ.34,120

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.34,120 పలికాయి.



ఖరీఫ్ లక్ష్యం 4.38 లక్షల హెక్టార్లు

ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లావ్యాప్తంగా 4.38 లక్షల హెక్టార్లలో పంటలు సాగులోకి రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

8లో

గరిష్టం/కనిష్టం


30.1°/23.2°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

కక్ష సాధింపులు తప్ప సంక్షేమం లేదా?

• వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత



అనంతపురం కార్పొరేషన్: 'కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి హామీల్లో ఒక్కటీ అమలు చేయ లేదు. ఇవి ప్రజల్లో మెదలినప్పుడల్లా ఏదో ఒక అంశాన్ని తెరపైకి తెచ్చి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. కక్ష సాధింపులు తప్ప.. సంక్షేమం, అభివృద్ధి అవసరం లేదా? మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి అరెస్టు దారుణ'మని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. మాజీ మంత్రి కాకాని అరెస్టును ఖండించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమ కేసులు నమోదు చేసి, అరెస్టులకు పాల్పడుతూ రాజ్యాంగాన్ని తుంగలోకి తొక్కుతున్నారని విమర్శించారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో రాష్ట్రంలో భయానకమైన వాతావరణాన్ని తీసుకువస్తున్నారన్నారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, విశ్రాంత అధికారులను అరెస్టు చేయడం శోచనీయమన్నారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ హామీలంటూ ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన చంద్రబాబు.. ఇప్పుడు వాటి గురించి ఏమాత్రమూ ఆలోచించడం లేదని విమర్శించారు. ఆయన జీవితమంతా అబద్ధాలమయమని దుయ్యబట్టారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి తప్పక బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

గిరిజన పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

అనంతపురం రూరల్: గిరిజన పాఠశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామాంజినేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 9 పాఠశాలలు ఉన్నాయన్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి 3 నుంచి 9వ తరగతిలో ప్రవేశాలకు ఆయా పాఠశాలల్లో ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

యువ వైద్యుడిని మింగిన రోడ్డు ప్రమాదం



కృష్ణ జగన్ మృతదేహం

కోలారు: రోడ్డు ప్రమాదం ఓ యువ వైద్యుడిని మింగేసింది. కన్నవారికి కడుపుకోత మిగిల్చింది. కర్ణాటకలోని కోలారు జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అనంతపురం నగరానికి చెందిన యువ వైద్యుడు ప్రాణాలు కోల్పోయాడు. వివరాలు.. అనంతపురం నగరంలోని ఇందిరానగర్‌కి చెందిన వెంకటేశులు కుమారుడు కృష్ణ జగన్ (24) చిత్తూరు జిల్లా కుప్పంలోని పీఈఎస్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. ప్రస్తుతం హౌస్‌సర్జన్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల వ్యక్తిగత పని నిమిత్తం అనంతపురానికి వెళ్లిన ఆయన మళ్లీ సోమవారం తెల్లవారుజామున కళాశాలకు కారులో బయలుదేరాడు. కోలారు జిల్లా సిద్దనహళ్లి వద్ద చెన్నై – బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవేలో ఉదయం 8.30 గంటల సమయంలో కృష్ణ జగన్ ప్రయాణిస్తున్న కారు టైరు పేలి అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా తీవ్ర గాయాలైన డాక్టర్ కృష్ణ జగన్ ఘటనా స్థలంలోనే మరణించారు. బంగారుపేట పోలీసులు చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. కృష్ణ జగన్ మరణవార్తను తెలుసుకున్న కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు.

యోగాతో మానసికోల్లాసం



యోగా సాధన చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

తాడిపత్రి రూరల్: యోగాతో మానసికోల్లాసం కలుగుతుందని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పార్వతీ సమేత బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం సమీపంలో సోమవారం 'యోగాంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. పెన్నానది ఒడ్డున గల బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో యోగాసనాలు వేయడం సంతోషకరమని తెలిపారు. పట్టణంలోని భూదేవి, శ్రీదేవి సమేత చింతల వేంకటరమణస్వామి దేవాలయం, గుత్తి కోట పరిసరాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ యోగాంధ్ర యాప్‌లో రిజిస్ట్రేషన్ కావాలని పిలుపునిచ్చారు. అనంతరం బుగ్గ రామలింగేశ్వరస్వామిని కలెక్టర్ దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్లు తదితరులున్నారు.

ఇక.. పరేషన్

పొట్ట కొట్టి.. అవస్థలు తెచ్చిపెట్టి!

- కూటమి సర్కార్ కక్ష సాధింపు
- ఎండీయూ వాహనాల రద్దు
- రేషన్ దుకాణాల వద్దే సరుకులు తీసుకునేలా ఆదేశాలు
- ఎండీయూ వాహనదారులు, ఆపరేటర్లకు ఉపాధి కోత
- 'పాత' కష్టాలు తలచుకుని కార్డుదారుల గగ్గోలు

జిల్లాలో చౌక ధరల దుకాణాలు	1,645
రేషన్ కార్డుదారులు	6,60,330
ఎండీయూ వాహనాలు	405
వాహనాలపై ఆధారపడిన నిరుద్యోగులు	810 మంది



ప్రభుత్వ తీరును నిరసిస్తూ అనంతపురంలో సోమవారం ఎండీయూ వాహనాలతో ర్యాలీ నిర్వహిస్తున్న నిర్వాహకులు

రాయదుర్గం: పేదల జీవితాలతో చంద్రబాబు ప్రభుత్వం చెలగాటమాడుతోంది. మాజీ సీఎం వైఎస్ జగన్‌కు పేరొస్తుందనే అక్కసుతో నిర్దయగా నిర్ణయాలు తీసుకుంటోంది.తాజాగా.. ఇంటింటా బియ్యం పంపిణీ చేసే ఎండీయూ వాహన వ్యవస్థను రద్దు చేసింది. ఎండీయూ వాహనాలనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న నిరుద్యోగుల పొట్టకొట్టింది. మరోవైపు కూటమి సర్కారు చర్యలపై కార్డుదారులు సైతం గగ్గోలు పెడుతున్నారు. బియ్యం, పప్పుల కోసం ఇక ప్రతి నెలా కుస్తీలు పట్టాల్సి వస్తుందంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దేశవ్యాప్తంగా ప్రశంసలు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదల కోసం ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్ల వద్దకే వెళ్లి సరుకులు పంపిణీ చేసే విధానాన్ని ప్రవేశపెట్టారు. దీనికి దేశవ్యాప్తంగా ప్రశంసలు దక్కాయి. ఎండీయూ వాహనాల్లో త్రాసుతో తూకం వేసి బ్యాగులో బియ్యం పోసేవారు. 20 కిలోల కార్డుకు ఆ మేర తూకం పడితేనే సిగ్నల్ చూపేది. గతంలో రేషన్ డీలర్లు సరుకులు పంపిణీ చేసే క్రమంలో తకరారు చేసి కొంత మిగుల్చుకునేవారు. దీంతో కార్డుదారులకు నష్టం చేకూరేది. అలాంటి అవకతవకలకు చెక్ పెడుతూ పేదలకు సౌలభ్యంగా ప్రవేశపెట్టిన విధానాన్ని మరింత మెరుగుపర్చాల్సింది పోయి పూర్తిగా ఊపిరి తీస్తూ చంద్రబాబు సర్కారు తీసుకున్న నిర్ణయంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిర్ణయపై నిరసనాగ్రహం

అనంతపురం అర్బన్: ''ఇంటింటికీ రేషన్ పంపిణీ వాహనాలను తొలగించి మా పొట్ట కొట్టొద్దు. ఉపాధి కోల్పోయి మా కుటుంబాలు రోడ్డున పడతాయి'' అంటూ ఎండీయూ నిర్వాహకులు వాపోయారు. ఎండీయూ ఆపరేటర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నగరంలో ఎండీయూ వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు మాట్లాడుతూ ఇంటింటికీ రేషన్ పంపిణీ వ్యవస్థలో భాగంగా 2021 నుంచి జిల్లాలో 405 వాహనాల నిర్వాహకులు జీవనోపాధి పొందుతున్నామన్నారు. ఎండీయూ వాహనాలు తొలగిస్తే తమతో పాటు హెల్పర్లుగా ఉన్న వారు కూడా ఉపాధి కోల్పోయి వీధిన పడతారన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకుని ఎండీయూ వ్యవస్థను కొనసాగించాలన్నారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాబావలి, బాబ్‌జాన్, ఖాసీమ్, గంగాధర్, గణేష్, హనుమంత, పోతయ్య, బషీర్, రమేష్, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.



నాడు ఇళ్ల వద్దనే రేషన్ సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)



నేడు సరుకుల కోసం రేషన్ దుకాణం వద్ద పడిగాపులు కాస్తున్న దృశ్యం

కుటుంబం వీధిన పడుతుంది



గతంలో కూలి పనిచేసుకునే దాన్ని. నాకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎండీయూ మంజూరు కావడంతో ఇంటింటికీ రేషన్ పంపిణీ చేస్తూ ప్రభుత్వం ఇచ్చే డబ్బుతో గౌరవంగా కుటుంబాన్ని పోషించుకుంటున్నా. మా బాబు వలంటీర్‌గా ఉండేవాడు. అది తొలగించారు. ఇప్పుడు వాహనాలను తొలగిస్తే మా కుటుంబం వీధిన పడుతుంది.

–బండి ముంతాజ్, వైఎస్సార్ కాలనీ, కురుగుంట

కంతులు ఎలా చెల్లించాలి?




ఎండీయూ వాహనాల్ని రద్దు చేయడంతో ఆపరేటర్లు చిక్కుల్లో పడినట్లయింది. వాహనాలకు సంబంధించి నెలవారీ కంతులు బ్యాంకులకు ఎలా చెల్లించాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వ నిర్ణయంతో ఆపరేటర్లకే కాదు, కార్డుదారులకూ ఇబ్బందులు తప్పవు. అందరినీ దృష్టిలో ఉంచుకుని ఎండీయూ వ్యవస్థపై ప్రభుత్వం పునరాలోచించాలి. తగిన నిర్ణయం తీసుకోవాలి.

– సుధాకర్, ఎండీయూ ఆపరేటర్, రాయదుర్గం

'చల్లగా' వచ్చేసింది

• 10 రోజులు ముందుగానే 'నైరుతి' పలకరింపు



నైరుతి రుతుపవనాలు సోమవారం జిల్లాను తాకినట్లు చూపిస్తున్న ఐఎండీ ఛాయా చిత్రం

అనంతపురం అగ్రికల్చర్: ఆశల 'నైరుతి' (సౌత్ వెస్ట్ మాన్‌సూన్స్) ఉమ్మడి అనంతను సోమవారం పలకరించింది. ఉమ్మడి జిల్లాలోకి రుతుపవనాలు ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారికంగా ప్రకటించింది. సోమవారం ఆకాశం మేఘావృతమై చిరుజల్లులతో 'నైరుతి'కి స్వాగతం పలికాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో చాలా ప్రాంతాల్లో తేలికపాటి వర్షపాతం నమోదైంది. సాధారణంగా జూన్ 1న కేరళను తాకే రుతుపవనాలు జూన్ 5 లేదా ఆ తర్వాత అనంతపురం జిల్లాలోకి ప్రవేశించే పరిస్థితి ఉండేదని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం. విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. అయితే ఈ సారి వాతావరణం అనుకూలంగా ఉన్నందున ఈనెల 24న కేరళను తాకిన నైరుతి సోమవారం 'అనంత'లోకి ప్రవేశించాయన్నారు. రుతుపవనాల ప్రభావంతో రాగల మూడు రోజులు జిల్లాకు వర్షసూచన ఉందన్నారు. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం పడవచ్చని, 41 నుంచి 61 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని తెలిపారు. చాలా ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం పడవచ్చన్నారు.

ఖరీఫ్‌కు కీలకం..

ఉమ్మడి జిల్లా పరిధిలో ఖరీఫ్ కింద దాదాపు 8 లక్షల హెక్టార్ల భారీ విస్తీర్ణంలో సాగులోకి వచ్చే వ్యవసాయ, ఉద్యాన పంటలకు 'నైరుతి' ప్రభావంతో కురిసే వర్షాలే కీలకం. రుతుపవనాలు ప్రభావం చూపిస్తే మంచి వర్షాలు కురుస్తాయి. జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య నాలుగు నెలల పాటు వీటి ప్రభావంతో వర్షాలు నమోదవుతాయి. జిల్లా వార్షిక సాధారణ వర్షపాతం 512.4 మి.మీ కాగా అందులో కీలకమైన ఖరీఫ్ నాలుగు నెలల కాలంలో 319.7 మి.మీ నమోదు కావాల్సి ఉంటుంది. జూన్‌లో 61 మి.మీ, జూలైలో 63.9, ఆగస్టులో 83.8, సెప్టెంబర్‌లో 110.9 మి.మీ సాధారణ వర్షపాతంగా నిర్ధారించారు.

జననాలంటే 'లెక్కే'లేదు!

- ప్రైవేటు ఆస్పత్రుల మాయాజాలం
- ప్రసవాల రిజిస్ట్రేషన్స్‌లో అవకతవకలు
- నమోదులో లేని 8,661 ప్రైవేటు ఆస్పత్రుల ప్రసవాలు
- రాష్ట్రంలో అత్యధికంగా మిస్సింగ్ రిజిస్ట్రేషన్‌లు జిల్లాలోనే
- నర్సింగ్ హోంలలో జరిగే ప్రతి ప్రసవంపై సమాచారం ఇవ్వాలని నిబంధన
- ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాకంతో జనగణనలో ఇబ్బందులు



2024 ఏప్రిల్ నుంచి 2025 ఫిబ్రవరి వరకూ ప్రసవాల నమోదు ఇలా..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో	11,591
ప్రైవేటు ఆస్పత్రుల్లో	20,481
ఆర్సీహెచ్ పోర్టల్‌లో నమోదైనవి	34,858
సీఆర్ఎస్‌లో నమోదైనవి	48,224
మిస్సింగ్ రిజిస్ట్రేషన్స్	8,661

(ఒక్కో పోర్టల్‌లో ఒక్కో రకంగా నమోదు కావడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రైవేటు ఆస్పత్రుల విచ్చలవిడితనం రకరకాల ఇబ్బందుకు గురి చేస్తోంది. దేశవ్యాప్తంగా ఏ జిల్లాలో అయినా మారుమూల గ్రామానికి చెందిన మహిళ ప్రసవించినా తల్లీబిడ్డ వివరాలు నమోదు చేయాలనేది నిబంధన. కానీ మిస్సింగ్ రిజిస్ట్రేషన్‌లలో రాష్ట్రంలోనే జిల్లా ముందంజలో ఉంది. జరుగుతున్న ప్రసవాలకు, నమోదవుతున్న వాటికీ పొంతన లేకుండా పోయింది. దీంతో కేంద్రం నుంచి ప్రసవ సమయంలో వచ్చే లబ్ధి కూడా జరగకుండా పోతోంది. జనాభా లెక్కల్లోనూ భారీ తేడా చోటు చేసుకుంటోంది.

8,661 మిస్సింగ్ రిజిస్ట్రేషన్‌లు..

2024–25 సంవత్సరంలో జిల్లాలో వాస్తవానికి 48,224 డెలివరీలు జరిగినట్టు సీఆర్ఎస్ (సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టం)లో నమోదైంది. ఈ సంఖ్య ఆర్సీహెచ్ (రీప్రొడక్టివ్ చైల్డ్ హెల్త్)లో 34,858గా ఉంది. ఒక్కో కేంద్రం పోర్టల్‌లో ఒక్కో రకంగా సంఖ్య నమోదై ఉంది. జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రైవేటు ఆస్పత్రుల్లో జరిగే డెలివరీలు, గర్భిణుల నమోదు తప్పుల తడకగా ఉన్నట్టు తేలింది. ముఖ్యంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో 8,661 ప్రసవాలు అసలే నమోదు కాలేదు. దీంతో జిల్లాలో ఎంతమంది పుడుతున్నారు, ఎవరికి ఎలాంటి లబ్ధి జరుగుతోందన్నది తెలియడం లేదు.

2,800కు పైగా అబార్షన్లు..!

జిల్లాలో మిస్సింగ్ ప్రసవాలే కాదు అబార్షన్లు కూడా గుట్టుగా జరుగుతున్నాయి. ఈ ఏడాది రమారమి 2,800కుపైగా అబార్షన్లు ప్రైవేటు ఆస్పత్రుల్లో జరిగినట్టు తెలిసింది. వాస్తవానికి ప్రసవం లేదా అబార్షన్ ఏదైనా నమోదు చేసి జిల్లా ఆరోగ్యశాఖ (డీఎంహెచ్ఓ)కు సమాచారం ఇవ్వాలి. ఎందువల్ల అబార్షన్ చేయాల్సి వచ్చిందనేది నివేదికలో పొందుపరచాలి.ఈ విషయంలో ప్రైవేటు ఆస్పత్రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. లింగనిర్ధారణ చేసి ఆడపిల్ల అని తెలియడంతో అబార్షన్ చేస్తున్నట్టు కూడా విమర్శలొస్తున్నాయి. ఓవైపు జననాల రేటు తగ్గిపోతుంటే ప్రైవేటు వైద్యులు అబార్షన్లు చేసి మరింత తగ్గిపోయేలా చేస్తున్నారు. ప్రస్తుతం బర్త్ రేటు 1.5 కంటే తక్కువగా నమోదవుతోంది.

వామ్మో.. ఇన్ని సమస్యలా...





అర్జీదారులతో కిక్కిరిసిన తాడిపత్రి మున్సిపల్ కార్యాలయం, (ఇన్‌సెట్‌లో) అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, జేసీ

తాడిపత్రి టౌన్: తాడిపత్రి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కిటకిటలాడింది. అధికారులు ఊహించని రీతిలో అర్జీదారులు రావడంతో మున్సిపల్ కార్యాలయం కిక్కిరిసిపోయింది. కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, జేసీ శివ్‌నారాయణశర్మ, ఇతర జిల్లాధికారులు అర్జీలు స్వీకరించారు. దాదాపు 380 అర్జీలు వచ్చినట్లు తెలిసింది. అత్యధికంగా రెవెన్యూ సమస్యలపై అర్జీలున్నట్లు సమాచారం. ఇక.. అర్జీదారులకు అనుగుణంగా మున్సిపల్ కార్యాలయంలో సౌకర్యాలు ఏర్పాట్లు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయం పైఅంతస్తులో కార్యక్రమం నిర్వహించడంతో దివ్యాంగులు, వృద్ధులు అవస్థలు పడ్డారు.

వినతుల్లో కొన్ని..

544డీ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఇళ్లు కోల్పోయిన తమకు పరిహారం అందలేదని తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి, పెద్దపప్పూరు మండలం ముచ్చుకోటకు చెందిన పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పెద్దపప్పూరు మండలం తిమ్మనచెరువు గ్రామంలోని వజ్రగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూములను కొందరు కబ్జా చేశారని, భూములను కాపాడాలని ఆలయ అర్చకులు వినతిపత్రం అందజేశారు. తాడిపత్రిలో ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేయాలని విలేకరులు ఎమ్మెల్యే, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే విలేకరులకు ఇంటి స్థలాలివ్వాలని కోరారు.

పనిచేసినా పనిష్‌మెంట్

- ఎస్జీటీ కేడర్ సర్వీస్ పాయింట్లు కలపని ప్రభుత్వం
- 6–10 ఏళ్ల సర్వీస్ పాయింట్లు కోల్పోతున్న టీచర్లు
- పాయింట్ల నమోదులో 2017 బదిలీ టీచర్లకూ తీవ్ర అన్యాయం
- లబోదిబోమంటున్న ఉపాధ్యాయులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఏళ్ల తరబడి పని చేసినా...తాజా బదిలీల్లో ప్రభుత్వం తమకు పనిష్‌మెంట్ ఇస్తోందని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలుత ఎస్జీటీ కేడర్‌కు ఎంపికై పని చేస్తూ...కొన్నేళ్లకు మరో డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికై సర్వీస్‌లో ఒకరోజు కూడా గ్యాప్ లేకుండా పని చేస్తున్న టీచర్లకు ఎస్జీటీ కేడర్‌లో పని చేసిన సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోవడం లేదు. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదని, ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 'టీచర్ల బదిలీ చట్టం-2025'తో ఈ సమస్యను ఎదుర్కొంటున్నామంటూ బాధిత టీచర్లు వాపోతున్నారు. ఎస్జీటీ కేడర్‌లో పని చేసిన 6–10 ఏళ్ల సర్వీస్‌ను కోల్పోతున్నారు. ఒక్కో టీచరు 3–5 పాయింట్లు దాకా నష్టపోతున్నారు. గతంలో జరిగిన పలు బదిలీల్లో తమకు ఎస్జీటీ కేడర్ పాయింట్లు సర్వీస్‌కు కలిపారని గుర్తు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 200 మందికి పైగా ఇలాంటి టీచర్లు ఉన్నారు. వారంతా రోజూ డీఈఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. చివరకు ఉపాధ్యాయ సంఘాల నాయకులకు మెసేజ్‌లు పెడుతూ ప్రభుత్వానికి తమగోడు వినిపించాలంటూ సోషల్ మీడియా వేదికగా విన్నవించుకుంటున్నారు.

తప్పనిసరి బదిలీ... పాయింట్లలో అన్యాయం

2017లో బదిలీ అయిన టీచర్లందరినీ తప్పనిసరిగా బదిలీ చేస్తున్నారు. 8 ఏళ్ల సర్వీస్ పూర్తికాకపోయినా ఈనెల 31 కటాఫ్ తేదీగా పెట్టి 23.2828 పాయింట్లతో 8 ఏళ్లు పూర్తయినట్లు భావించి వారందరి పోస్టులను ఖాళీలుగా చూపించారు.8 ఏళ్లు అంటే 24 పాయింట్లు ఇవ్వాలి. అదే 2023, 2021 రేషనలైజేషన్‌కు గురైన వారికి పూర్తిగా 24 పాయింట్లు ఇచ్చారు. దీంతో వారందరూ 2017 బ్యాచ్ వారికంటే ముందుకు వచ్చారని 2017లో బదిలీ అయిన టీచర్లు వాపోతున్నారు.

9 ఏళ్లు సర్వీస్ అయినా 8 ఏళ్లకే పాయింట్లు

2014 డీఎస్సీలో ఎంపికైన వారు 2016 జూన్ 1న పాఠశాలల్లో చేరారు. వారందరికీ 2024 జూన్ 1 నాటికి ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తయింది. వారంతా అదే ఏడాది తప్పనిసరిగా బదిలీ కావాలి. అయితే ఆ ఏడాది బదిలీలు జరగలేదు. ప్రస్తుతం (9వ సంవత్సరం) కూడా అదే పాఠశాలలో పని చేస్తూ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే వారికి గరిష్టంగా 8 ఏళ్లకే స్టేషన్ పాయింట్లు చూపిస్తున్నారు. ఒక ఏడాదికి స్టేషన్ పాయింట్లు పూర్తిగా కోల్పోతున్నారు. 2021, 2023 సంవత్సరాల్లో జరిగిన బదిలీల్లో ఎలాంటి సీలింగు విధించకపోవడం వల్ల గరిష్టంగా ఎన్ని సంవత్సరాలు పని చేశారో అన్ని సంవత్సరాలకూ స్టేషన్ పాయింట్లు ఇచ్చారు. ఈ ప్రభుత్వం గరిష్టంగా 8 ఏళ్ల సీలింగ్ పెట్టడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని 2014 డీఎస్సీ టీచర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అధికారులను కలిసేందుకు వేచిచూస్తున్న టీచర్లు

నేడు హెచ్‌ఎంల తుది సీనియార్టీ జాబితా..

బదిలీల్లో భాగంగా మంగళవారం హెచ్‌ఎంల తుది సీనియార్టీ జాబితా ప్రదర్శించనున్నారు. ఖాళీలను వెబ్‌సైట్‌లో ఉంచనున్నారు. స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాను ప్రదర్శించనున్నారు. ఎస్జీటీల దరఖాస్తులను నేడు, రేపు పరిశీలించనున్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్: ఓ వ్యక్తి పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన వలి.. తన కుమార్తె కనిపించడం లేదంటూ నెల రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు వలి కుమార్తె ఆచూకీ గుర్తించి ఆమెను పిలుచుకొచ్చి విచారణ చేసి, పంపివేశారు. అయితే తన కుమార్తెను అప్పగించకపోవడంతో వలి సోమవారం పీఎస్‌కు వెళ్లి మాట్లాడాడు. ఆ సమయంలో సీఐ యువరాజ్ తనను దుర్భాషలాడుతూ బెదిరింపులకు దిగారంటూ స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేశాడు. అక్కడే ఉన్న కానిస్టేబుల్ స్పందించి అడ్డుకున్నారు. ఘటనపై సీఐ మాట్లాడుతూ.. వలి కుమార్తె మేజర్ కావడంతో ఆమె అభ్యర్థన మేరకు అమ్మమ్మకు అప్పగించామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

కౌలు రైతులకు ఇచ్చింది 27 కార్డులేనా?

- అధికారుల తీరుపై కలెక్టర్ అసహనం

అనంతపురం అర్బన్: 'కౌలు రైతులకు 8,500 గుర్తింపు కార్డులు అందించాలని లక్ష్యం విధిస్తే... ఇప్పటి వరకు 27 కార్డులే ఇచ్చారు. లక్ష్యానికి దరిదాపుల్లోనూ లేరు. ఇలాగేనే పనిచేసేది' అంటూ కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీకాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదేతీరు కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. 'పీఎం కిసాన్'కు సంబంధించి రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జ్, మండల వ్యవసాధికారి, తహసీల్దారు లాగిన్‌లో వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లాలో ల్యాండ్ బ్యాంక్ సిద్ధంగా ఉందని, వివిధ ప్రాజెక్టులకు భూ బదలాయింపు, భూ సేకరణ ప్రక్రియలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఏపీఐఐసీ పరిధిలో ఎంఎస్ఎంఈ పార్కులకు, నెడ్‌క్యాప్ పరిధిలోని ప్రాజెక్టులు, ఆయిల్ ఫెడ్, డంపింగ్ యార్డ్, కాపు, బీసీ, వైశ్య భవన్, టెలీ కమ్యూనికేషన్, ఈఎస్ఐ డిస్పెన్సరీ, ఎన్‌హెచ్ 544డీ జాతీయ రహదారి తదితర ప్రాజెక్టులకు భూ బదలాయింపు, భూసేకరణ యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ ఎ.మలోల, జాతీయ రహదారి శాఖ పీడీ తరుణ్‌కుమార్, సైట్ ఇంజనీర్ సాయికృష్ణ, భూవిభాగం సూపరింటెండెంట్ రియాజుద్దీన్ డీటీలు కిరణ్, శ్రీనివాస్, సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

అనంతపురం: నగరంలోని హమాలి కాలనీకి చెందిన కె.రాముడు కుమారుడు ఎం.శంకరయ్య (35) అనుమానాస్పద స్థితిలో సోమవారం మృతదేహమై కనిపించాడు. టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపిన మేరకు... నగరంలోని లలితా జ్యువెలర్స్‌లో పనిచేస్తున్న ఎం.శంకరయ్య వారం రోజుల క్రితం భార్యతో గొడవపడ్డాడు. దీంతో ఆమె ఎదురుగానే ఉన్న తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఆ సమయంలో ఇంట్లో గడియ పెట్టుకుని మద్యం తాగి పడుకున్న శంకరయ్య రోజులు గడుస్తున్నా తలుపులు తీయలేదు. ఇంటి నుంచి దుర్గంధం రావడంతో సోమవారం చుట్టుపక్కల వారు లోపలికి తొంగి చూశారు. లోపల విగతజీవిగా పడి ఉన్న శంకరయ్య కనిపించడంతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని తలుపులు బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించారు. మద్యంలోకి విషం కలుపుకుని తాగాడా? లేదా మరేదైనా కారణంతో మృతి చెందాడా? అనే కోణంలో విచారణ చేపట్టారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



ఎద్దులతో అంతర సేద్యం చేస్తున్న రైతు





హంపాపురం వద్ద ట్రాక్టర్‌తో పొలాన్ని దుక్కి చేస్తున్న రైతు, ట్రాక్టర్లతో పొలాలకు పేడ ఎరువు తోలుతున్న దృశ్యం

మురిపిస్తున్న ముంగారు

రైతులు ఎంతగానో ఎదురు చూస్తున్న నైరుతి రుతుపవనాలు జిల్లాలోకి సోమవారం ప్రవేశించాయి. దీంతో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. రైతులు పొలం బాట పట్టారు. అన్నదాత సుఖీభవ, ఇన్‌పుట్, ఇన్సూరెన్స్ తదితర ప్రభుత్వ సాయం ఏదీ అందకపోయినా... కోటి ఆశలతో ముంగారు సేద్యం పనులు మొదలు పెట్టారు. రాప్తాడు మండలం హంపాపురం వద్ద 44వ జాతీయ రహదారి పక్కనే రైతులు సోమవారం తమ పొలాలను దుక్కి చేస్తూ అటుగా వెళుతున్న వారికి కనువిందు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

'ఖరీఫ్' లక్ష్యం 4.38 లక్షల హెక్టార్లు

- అత్యధికంగా కళ్యాణదుర్గం మండల వ్యాప్తంగా 22,910 హెక్టార్లలో పంటలు
- మొత్తం నీటి వసతి కింద 1,32,321 హెక్టార్లలో సాగు
- వర్షాధారంగా 3,06,450 హెక్టార్ల సాగు అంచనా



సాగుకు సిద్ధమవుతున్న పంట పొలాలు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాకు సంబంధించి జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ముంగారు (ఖరీఫ్) వ్యవసాయానికి రైతులు సిద్ధమవుతుండగా... ఇందుకు అనుగుణంగానే ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటల సాగు అంచనాలు కూడా అధికారులు ఎక్కువగానే అంచనా వేశారు. ఇందులో భాగంగానే నైరుతి ప్రభావంతో కురిసే వర్షాలపై వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, జొన్న, పొద్దుతిరుగుడు తదితర 15 రకాల పంటలు 3,06,450 హెక్టార్లలో సాగులోకి రావచ్చని అంచనా వేశారు. అలాగే నీటి వసతి కింద వరి, మొక్కజొన్న, ఎండుమిరప, టమాట ఉల్లి, మల్బరీ తదితర పంటలు 1,32,321 హెక్టార్లలో సాగు చేస్తారని అంచనా వేశారు. గత ఐదేళ్లలో ఈ–క్రాప్‌లో నమోదైన గణాంకాల ఆధారంగా ఈ ఖరీఫ్‌లో అన్ని రకాల పంటలు 4,38,771 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగులోకి రావచ్చని అధికారులు అంచనాకు వచ్చారు.

కళ్యాణదుర్గం టాప్

ఖరీఫ్‌లో అటు నీటి వసతి, ఇటు వర్షాధారంగా కళ్యాణదుర్గం మండలంలో 22,910 హెక్టార్ల భారీ విస్తీర్ణంలో పంటలు సాగులోకి వచ్చే అవకాశాలు ఉన్నట్లు అధికారిక అంచనా. ఇందులో నీటి వసతి కింద 6,527 హెక్టార్లు, వర్షాధారంగా 16,383 హెక్టార్లుగా గుర్తించారు. అలాగే తాడిపత్రి మండలంలో అతి తక్కువగా 8,261 హెక్టార్లలో అన్ని రకాల పంటలు వేస్తారని అంచనా వేశారు. ఆ తర్వాత పెద్దపప్పూరులో 8,372 హెక్టార్లు, పుట్లూరులో 9,412 హెక్టార్లు, యల్లనూరులో 9,728 హెక్టార్లు, బుక్కరాయసముద్రంలో 9,670 హెక్టార్ల విస్తీర్ణంలో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగులోకి వస్తాయని లెక్క వేశారు. శింగనమల నియోజకవర్గ పరిధిలో తక్కువ విస్తీర్ణంలో పంటలు వేయనున్నారు. ఇందులోనూ నీటి వసతి కింద ఉద్యాన పంటలు ఎక్కువగానూ, వర్షాధారంగా తక్కువగా పంటలు సాగు చేస్తారని అంచనా వేశారు. ఓవరాల్‌గా వర్షాధారంగా యల్లనూరు మండలంలో కేవలం 2,243 హెక్టార్లలో పంటలు సాగులోకి వస్తున్నట్లు అంచనా. వరి పంట ఎక్కువగా ఉన్నందున కణేకల్లు మండలంలో 8,204 హెక్టార్లలో నీటి వసతి కింద పంటలు సాగు చేయనున్నట్లు అంచనా వేశారు.

అత్యధిక విస్తీర్ణంలో సాగులోకి రానున్న మండలాలు ఇలా

మండలం	నీటి వసతి (హెక్టార్లలో)	వర్షాధారం (హెక్టార్లలో)	మొత్తం విస్తీర్ణం (హెక్టార్లలో)
కళ్యాణదుర్గం	6,527	16,383	22,910
వజ్రకరూరు	2,672	18,367	21,039
గుంతకల్లు	2,359	17,520	19,879
పెద్దవడుగూరు	1,618	17,648	19,266
రాయదుర్గం	2,145	15,874	18,019
కూడేరు	5,240	12,628	17,868
కణేకల్లు	8,204	9,054	17,258
బ్రహ్మసముద్రం	2,989	13,063	16,052
గుత్తి	1,586	14,822	16,408
కంబదూరు	3,680	11,457	15,137

ఈ స్థలం నాది.. కాదనేవారెవ్వరు?

- గ్రామ కంఠాన్ని ఆక్రమించి బండలు పాతిన టీడీపీ నేత
- రెవెన్యూ అధికారుల అండతోనే దౌర్జన్యమంటున్న స్థానికులు



రహదారిని ఆక్రమించి బండలు పాతిన దృశ్యం

తాడిపత్రి: 'అధికారం మాది.. ఇక్కడ మేము ఏమీ చేసినా చెల్లుబాటు అవుతుంది. మమ్మల్ని అడ్డుకునే దమ్ము ఎవరికీ లేదు' అనే ధోరణి టీడీపీ నేతలో వ్యక్తమైంది. గ్రామ కంఠం స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించుకుని బండలు పాతేయడమే కాక... ఆ స్థలం తనదని, కాదనేవారెవ్వరూ లేరంటూ దౌర్జన్యానికి తెరలేపిన ఘటన తాడిపత్రి మండలం ఇగుడూరు గ్రామంలో వెలుగు చూసింది. వివరాలు... ఇగుడూరు గ్రామంలోని సర్వే నంబర్ 306లో కొంత స్థలం గ్రామ కంఠంగా ఉంది. ఈ స్థలానికి అవతలి వైపు పట్టా భూముల్లో కొందరు పక్కా గృహాలు నివాసముంటున్నారు. వీరి ఇళ్లకు రాకపోకలు సాగించేందుకు సర్వే నంబర్ 306లోని గ్రామ కంఠంలోని 12 అడుగుల వెడల్పు, 20 అడుగుల పొడవు ఉన్న స్థలమే ప్రధాన మార్గం. కాగా, ఈ స్థలానికి ఓ వైపు పుల్లన్న అనే వ్యక్తి ఇంటిని నిర్మించుకుని 30 ఏళ్లుగా నివాసముంటున్నాడు. అతడి ఇంటి ముందర రస్తాకు ఓ వైపు పంచాయతీ బోరును వేశారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సదరు రస్తాతో పాటు పుల్లన్న ఇంటిని ఆక్రమించుకునేందుకు అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత బోయ వారాది పావులు కదిపాడు. ఇందులో భాగంగానే గత నెల 9న టీడీపీకి చెందిన బాలమద్దిలేటి మరికొందరితో కలసి పంచాయతీ బోరును దౌర్జన్యంగా తొలగించారు. ఈ విషయంగా స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. రెండు రోజుల క్రితం బోయ వారాది, బాల మద్దిలేటి మరికొందరు కలసి రస్తాను ఆక్రమించి అటు వైపు నివాసముంటున్న వారు రాకపోకలు సాగించేందుకు వీలు లేకుండా దౌర్జన్యంగా బండల పాతారు. ఇది చూసిన స్థానికులు అడ్డుకోబోతే ఆ స్థలం తనదంటూ వారాది దౌర్జన్యానికి తెగబడ్డాడు. రెవెన్యూ అధికారుల అండతోనే టీడీపీ నేతలు బరి తెగించారని, సమస్య పరిష్కారానికి తహసీల్దార్ రజాక్‌వలి ఎంత మాత్రం చర్యలు తీసుకోవడం లేదంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ ఇళ్లకు రాకపోకలు సాగించేలా ఉన్న రస్తా ఆక్రమణలను తొలగించాలని కోరారు.

ముచ్చుకోట స్కూల్ హెచ్‌ఎంకు షోకాజ్

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం ఎడ్యుకేషన్: విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిన పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యంకు షోకాజ్ నోటీసు జారీ అయింది. కీలకమైన టీచర్ల బదిలీల ప్రక్రియపై అలసత్వం వహించిన ఆయన తన స్కూల్‌లో బదిలీలకు దరఖాస్తు చేసుకున్న టీచర్లకు సంబంధించిన హార్డ్ కాపీలపై కౌంటరు సంతకాలు చేయకపోవడమే కాక, వారికి అందుబాటులో లేకుండా వెళ్లిపోయారు. ఫోన్లు చేసి అడిగితే.. 'నేను ఎంఈఓకు చెప్పాను వెళ్లి ఆయనను కలవండి. మీ దరఖాస్తును లాగిన్‌లో ఆమోదం తెలుపుతారని' చెపుతూ వచ్చాడు. ఆ టీచర్లు ఎంఈఓను కలవగా... హెచ్‌ఎం కౌంటర్ సంతకం లేకుండా తాను ఓకే చేయలేనంటూ తెగేసి చెప్పాడు. ఆదివారం చివరి రోజు కావడం... హెచ్‌ఎం అందుబాటులోకి రాకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురైన టీచర్లు చివరకు విషయాన్ని డీఈఓ ప్రసాద్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. డీఈఓ పలుమార్లు ఫోన్ చేసినా సదరు హెచ్‌ఎం మొబైల్ పని చేయలేదు. చేసేదిలేక ఎంఈఓను ఆఫీసుకు పిలిపించి ఆ టీచర్ల దరఖాస్తులన్నీ ఆమోదం తెలపాలని సూచించారు. డీఈఓ ఆదేశాలతో ఎంఈఓ తన లాగిన్‌లో ఆమోదం తెలిపారు. ఈ వ్యవహారంపై 'హెచ్‌ఎం నిర్ధారించకుండానే ఎంఈఓ ఆమోదం' శీర్షికన సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. సమస్యను కొందరు పాఠశాల విద్య డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు హెచ్‌ఎం సుబ్రహ్మణ్యంకు డీఈఓ షోకాజ్ నోటీసు జారీ చేశారు. నోటీసు అందుకున్న మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే రైతుకు విద్యుత్ షాక్

బొమ్మనహాళ్: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తన తండ్రి కరెంట్ షాక్‌కు గురై ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడని పోలీసులకు రామసాగరం గ్రామానికి చెందిన రైతు బి.సంజీవరెడ్డి కుమారుడు మంజునాథరెడ్డి ఫిర్యాదు చేశాడు. బూదిగుమ్మ పరిధిలోని తమ వ్యవసాయ తోటలో విద్యుత్ సరఫరా సమస్యలపై ఏరియా లైన్‌మెన్‌కు తెలియజేసినా ఆయన పట్టించుకోలేదన్నారు. ఆదివారం ఎల్‌సీ తీసుకుని తన తండ్రి సంజీవరెడ్డి విద్యుత్ స్తంభం పైకి ఎక్కి మరమ్మతు చేస్తుండగానే ఎల్‌సీ క్లియర్ చేయడంతో షాక్‌కు గురై పైనుంచి కిందకు పడ్డారన్నాడు. చాతీకి బలమైన గాయం కావడంతో ప్రాణాపాయస్థితిలో అనంతపురంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, ప్రమాదానికి కారణమైన లైన్‌మెన్ నారాయణ, ఏఈ గంగాధర్‌గుప్తపై చర్యలు చేపట్టి న్యాయం చేయాలంటూ ఎస్‌హెచ్‌ఓకు ఆయన ఫిర్యాదు చేశాడు.

పరాకాష్టకు 'రెడ్‌బుక్' వేధింపులు

- అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం
- వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్



అనంతపురం కార్పొరేషన్: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం వేధింపులు పరాకాష్టకు చేరుకున్నాయని వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్ ధ్వజమెత్తారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అరెస్టును ఖండించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని కక్షపూరిత చర్యలకు పాల్పడడం దారుణమన్నారు. పల్నాడు జంట హత్య కేసులో టీడీపీకి సంబంధించిన ఇరువర్గాలు గొడవపడి ఓ వర్గం వారిని హత్య చేశారని, మృతుల బంధువుల చెబుతున్నా.. ఎలాంటి సంబంధం లేని పిన్నెల్లి బ్రదర్స్‌ను కేసులో ఇరికించడం అన్యాయమన్నారు. సినీ నటుడు పోసాని కృష్ణమురళీ, వల్లభనేని వంశీను ముప్పుతిప్పలు పెడుతున్నారన్నారు. ప్రజలకు మేలు చేయాల్సిన నాయకులు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ రాష్ట్రాభివృద్ధిని తిరుగోమనం దిశగా మళ్లించారని మండిపడ్డారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఎవరు ముందుకు వస్తారన్నారు. అమరావతి జపం, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు తప్ప కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచి ఏదీ లేదన్నారు. ఏడాది గడుస్తున్నా సూపర్ సిక్స్ హామీలను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని, రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

హెచ్‌ఎం పదోన్నతులకు నేడు సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని పాఠశాల సహాయకుల నుంచి గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాలో ఉన్న టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు సోమవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. https://deoananthapuramu.blogspot.com వెబ్‌సైట్‌లో ప్రొవిజినల్ సీనియార్టీ ఉంచినట్లు తెలిపారు. ఈ జాబితాలోని పీఎస్‌హెచ్‌ఎంలు/స్కూల్ అసిస్టెంట్లు తమ విద్యార్హత ఒరిజనల్ సర్టిఫికెట్లు, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఉపాధ్యాయులు కుల ధ్రువీకరణ పత్రాలు, పీహెచ్ టీచర్లు తమ ఒరిజనల్ విద్యార్హత పత్రాలతో పాటు మెడికల్ బోర్డు జారీ చేసిన సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు అనంతపురంలోని మొదటి రోడ్డులో ఉన్న శారదా బాలికల నగరపాలక ఉన్నత పాఠశాలలో చేపట్టిన పరిశీలన ప్రక్రియకు హాజరు కావాలని సూచించారు.

ఆస్తి పన్ను పెంపు అసంబద్ధం : సీపీఎం



పోరుయాత్రను ప్రారంభిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

గుంతకల్లు టౌన్: పట్టణాల్లో ఆస్తి పన్ను పెంపు అసంబద్ధంగా ఉందని, సామాన్య, మధ్య తరగతి ప్రజలపై కోట్లాది రూపాయల భారాన్ని మోపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప అన్నారు. ఆస్తి పన్ను పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఎం చేపట్టిన ప్రజా పోరుయాత్రను సోమవారం ఆయన గుంతకల్లులో జెండా ఊపి ప్రారంభించారు. ఆస్తి పన్నులను 20 శాతం పెంచేలా త్వరలో చేపట్టనున్న సర్వేను ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, నాయకులు నాగరాజు, సురేంద్ర, రంగమ్మ, తిమ్మప్ప, ఓబులేసు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

బుక్కరాయసముద్రం: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా కోర్సులకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని రెడ్డిపల్లి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధర తెలిపారు. 2025–25 విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాలకు ఈ నెల 28 నుంచి https://angrau.ac.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు రెడ్డిపల్లిలోని పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలన్నారు.

వ్యవసాయశాఖలో 'బదిలీల జాతర'



బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్, ఉమ్మడి నాలుగు జిల్లాల అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖలో సోమవారం బదిలీల జాతర జరిగింది. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో నిర్వహించిన జోనల్‌స్థాయి కౌన్సెలింగ్‌కు రాయలసీమ నాలుగు ఉమ్మడి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున అధికారులు, ఉద్యోగులు హాజరయ్యారు. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారితో పాటు రిక్వెస్ట్, సిఫారసుల కింద కూడా కొందరు ఉద్యోగులు హాజరయ్యారు. ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలో అర్హత కలిగిన 31 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఐదుగురు సూపరింటెండెంట్లు, 19 మంది ఏడీఏలు, 118 మంది ఏఓలతో పాటు 120 మందికి పైగా రిక్వెస్ట్ కింద బదిలీ కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. వ్యవసాయశాఖ కమిషనరేట్‌కు చెందిన అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్ సమక్షంలో అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, నంద్యాల, కర్నూలు, చిత్తూరు, తిరుపతి జిల్లాల జేడీఏలు ఉమామహేశ్వరమ్మ, సుబ్బారావు, నాగేశ్వరరావు, చంద్రానాయక్, మురళీకృష్ణ, వరలక్ష్మి, ప్రసాదరావు, జే.మురళీకృష్ణతో పాటు ఆయా జిల్లాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్, సూపరింటెండెంట్లు కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. కాగా, కౌన్సెలింగ్ జరుగుతున్న తీరుపై కొందరు ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు కొందరివి పరిగణలోకి తీసుకుంటున్నా... మరికొందరివి తీసుకోవడం లేదన్నారు. అలాగే తమ విన్నపాలను పరిగణనలోకి తీసుకోవడం లేదని కొందరు అసోసియేషన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

పశుశాఖలో..

స్థానిక పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి జిల్లా పరిధిలో ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న ముగ్గురు వెటర్నరీ అసిస్టెంట్స్, ఒక జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు డ్రైవర్లు, 23 మంది ఆఫీస్ సబార్డినేట్స్‌కు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో రెండు జిల్లాల జేడీలు డాక్టర్ జీపీ వెంకటస్వామి, డాక్టర్ జి.శుభదాస్, ఆఫీస్ మేనేజర్, సూపరెండెంటెంట్లు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

రాప్తాడు: స్థానిక పంచాయతీ పరిధిలోని ముస్లిం మైనార్టీ కాలనీకి చెందిన ఓ బాలికను వేధింపులకు గురి చేసిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహర్ష తెలిపారు. కొన్ని నెలలుగా తమ కుమార్తెను ప్రేమ పేరుతో కదిరి మండలం బత్తలపల్లి గ్రామానికి చెందిన యువకుడు వేధిస్తున్నట్లు బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.



వారం రోజులుగా వినియోగిస్తున్న బెడ్‌షీట్‌పైనే చిన్నారికి స్కానింగ్ చేస్తున్న పీజీ విద్యార్థి (ఇన్‌సెట్) వాషింగ్‌కు తరలించకుండా మూడు రోజులుగా దిబ్బగా పడేసిన బెడ్‌షీట్లు

ఇది కాదా ఇన్‌ఫెక్షన్‌కు మార్గం!

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని రేడియాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ.. పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) విద్యార్థుల చేతికి పెత్తనం అప్పగించేశారు. వీరు కనీస సురక్షిత ప్రమాణాలు పాటించకపోవడం రోగుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రేడియాలజీ విభాగంలోని అల్ట్రాసౌండ్ స్కాన్ సెంటర్‌లో రోగులకు వినియోగించే బెడ్‌షీట్లను ఎప్పటికప్పుడు మార్చాల్సి ఉంది. అయితే వారం రోజులుగా వాటిని అలాగే ఉంచేశారు. అప్పుడే పుట్టిన పసికందు నుంచి వృద్ధుల వరకు అల్ట్రాసౌండ్ స్కాన్‌లు చేస్తూనే ఉన్నారు. ప్రధానంగా గర్భిణులు, బాలింతలకు అత్యధికంగా స్కానింగ్‌లు చేస్తుంటారు. సర్జికల్ విభాగం నుంచి సెల్యులైటీస్ కేసులూ వస్తుంటాయి. ఈ క్రమంలో బెడ్‌షీట్‌లను మార్చకుండా వాటిపైనే మరో రోగిని పడుకోబెట్టి స్కానింగ్ చేస్తే ఇన్‌ఫెక్షన్ సోకి సదరు రోగి ప్రాణాంతక, దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. ఇదే విషయాన్ని సాక్షాత్తూ వైద్యులే నొక్కి చెబుతున్నారు. అయినా రేడియాలజీ విభాగంలో పీజీ వైద్యులపనితీరులో మార్పు రాలేదు. అలాగే గత శుక్రవారం వినియోగించిన బెడ్‌షీట్లను వాషింగ్‌కు తరలించకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ విభాగంలో దిబ్బగా పడేశారు. రోగులకు ఉత్తమ వైద్యం ఇవ్వకపోయినా పర్వాలేదు కనీసం కొత్త వ్యాధులు సోకకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని రేడియాలజీ విభాగానికి వచ్చిన రోగుల సహాయకులు అంటున్నారు.

క్లుప్తంగా

అక్రమ కట్టడం తొలగింపు



డ్రైనేజీపై నిర్మించిన కట్టడాన్ని తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం రూరల్: అనంతపురం రూరల్ మండలం వెంగమనాయుడు కాలనీలో డ్రైనేజీపై అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలపై ఈనెల 20న సాక్షి పత్రికలో 'డ్రైనేజీని వదలరా తమ్ముళ్లు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ డ్రైనేజీపై నిర్మిస్తున్న కట్టడాలను వెంటనే తొలిగించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. సోమవారం పంచాయతీ అధికారులు వెంగమనాయుడు కాలనీకి చేరుకుని డ్రైనేజీపై నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను తొలగించారు. పంచాయతీ స్థలాలను అన్యాక్రాంతం చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

పదోన్నతుల ఖాళీలు తగ్గించొద్దు

- డీఈఓను కోరిన ఉపాధ్యాయులు



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న టీచర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ ఖాళీలు తగ్గించరాదని పలువురు ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అనంతపురంలోని శారదా నగరపాలక బాలికల ఉన్నత పాఠశాలలో నిరసన వ్యక్తం చేసి, డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. 2023లో తాత్కాలిక పదోన్నతులకు సంబంధించి ఎస్ఏ ఇంగ్లిష్‌లో 230 మందికి అవకాశం కల్పించారని గుర్తు చేశారు. ప్రస్తుతం చేపట్టిన పదోన్నతులలో అంతకు తగ్గకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యుడు, నాగభూషణ, కేశవరెడ్డి, జయరాం నాయక్, సిరాజుద్దీన్, శ్రీనివాసులు నాయక్, శ్రీదేవి, విజయశ్రీ, సురేష్, కృష్ణారెడ్డి, పీరూనాయక్, వన్నారెడ్డి, సూర్యనారాయణ, క్షీరలింగేశ్వర్, వెంకటేష్, రసూల్, ఓబిరెడ్డి, నరసింహులు, విశ్వనాథరెడ్డి, రాజశేఖర్, శివప్రసాద్, మధు, రమేష్ పాల్గొన్నారు.

సరైన సమాచారం లేక అవస్థలు



పరిష్కార వేదిక లేదని ప్రజలకు చెబుతున్న సెక్యూరిటీ గార్డు

అనంతపురం అర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం మార్పు విషయంలో కలెక్టరేట్ అధికారులు అనుసరిస్తున్న తీరు ప్రజలను ఇబ్బందికి గురిచేస్తోంది. వేదిక మార్పు చేసిన ప్రతిసారీ విషయాన్ని కేవలం ప్రకటనతో సరిపెడుతున్నారు. ఇలా ఇచ్చే సమాచారం ప్రజల్లోకి వెళ్లడం లేదు. దీంతో ప్రజలు పెద్దసంఖ్యలో కలెక్టరేట్‌కు తరలివస్తున్నారు. సోమవారం ఇదే పరిస్థితి కనిపించింది. దాదాపు రెండు వందల మంది తమ సమస్యలను అధికారులకు చెప్పుకుని అర్జీ ఇచ్చేందుకు జిల్లా నలుమూలల నుంచి వ్యయప్రయాసల కోర్చి కలెక్టరేట్‌కు తరలివచ్చారు. కలెక్టరేట్‌లో పరిష్కార వేదిక లేదని అక్కడి సెక్యూరిటీ గార్డు తెలపడంతో వారంతా ఉసూరుమంటూ వెనుతిరిగారు. రెవెన్యూ శాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది చాలా మంది ఉన్నారు. ప్రతి గ్రామానికి వీఆర్ఓలు, వీఆర్ఏలు ఉన్నారు. ఇక సచివాయల వీఆర్ఓలూ ఉన్నారు. పరిష్కార వేదిక కలెక్టరేట్‌లో కాకుండా మరో ప్రాంతంలో నిర్వహించే క్రమంలో క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా గ్రామాల్లో ప్రచారం చేయిస్తే ప్రజలకు ఇబ్బంది ఉండదని పలువురు సూచిస్తున్నారు.

'నా కుమార్తెను అప్పగించండి'

రాప్తాడు: 'నా కుమార్తెను నా భర్త బంధువులు తీసుకెళ్లారు. వారి నుంచి నా కుమార్తెను తీసుకొచ్చి అప్పగించండి' అని రాప్తాడులో నివాసం ఉంటున్న ఆలూరు గీతాంజలి సోమవారం రాప్తాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలు.. ధర్మవరం టౌన్‌కు చెందిన ఆలూరు గీతాంజలి.. 3 నెలల నుంచి రాప్తాడులో నివాసం ఉంటోంది. తాడిపత్రికి చెందిన అరుణ్ తేజ్ అనే యువకుడితో 2017లో గీతాంజలి ప్రేమ వివాహం చేసుకుంది. వివాహం అయిన తర్వాత శ్రీ సత్యసాయి జిల్లాలోని ధర్మవరంలో కాపురం పెట్టారు. వీరికి ఒక చిన్నారి (పోస హన్విత అరుణ్) జన్మించింది. గీతాంజలి భర్త అరుణ్ తేజ్ మృతి చెందాడు. పోస హన్విత అరుణ్‌ను కొన్ని రోజులు తమ దగ్గర ఉంచుకుని తిరిగి పంపిస్తామని చెప్పి భర్త బంధువులు తీసుకెళ్లారు. 'కూమార్తె విషయంలో పలుమార్లు అత్త వాళ్లని సంప్రదించినప్పటికీ వారి నుంచి సరైన సమాధానం రావడం లేదు. నా కూమార్తె ఆచూకీ కనుక్కొని అప్పగించాలని' గీతాంజలి ఫిర్యాదులో కోరింది.





మధ్యాహ్నం ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న గది

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన నలుగురు అధికారులు

అధికారులు హాజరైతే ఒట్టు..

ఆత్మకూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. అధికారులు యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించి పరిష్కార వేదికకు డుమ్మా కొడుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించాల్సిన కార్యక్రమానికి ముగ్గురు నుంచి నలుగురు మాత్రమే హాజరవుతున్నారు. అధికారులు ఇలా వచ్చి.. అలా వెళ్తుండటంతో సమస్యలపై అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక.. అర్జీలు ఎవరికి ఇవ్వాలో తెలియక నిరుత్సాహంతో తిరిగి వెళ్లిపోతున్నారు. అధికారులు వారికి సంబంధించిన కార్యాలయాల్లో కూడా ఉండటం లేదు. ఏమైనా అడిగితే ఫీల్డ్ వర్క్‌కు వెళ్లామని చెబుతున్నారని ప్రజలు చెబుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులు స్పందించక పోవడంతో మండల ప్రజలు తమ అర్జీలను కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇస్తున్నారు. అక్కడి నుంచి మళ్లీ మండలంలోని సంబంధిత అధికారులకు ఆ అర్జీలు వస్తున్నాయి. జిల్లా స్థాయి అధికారులు స్పందించి అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నిరసన తెలుపుతున్న ఏపీ మెడికల్, హెల్త్ మినిస్టీరియల్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు

నిరసనాగ్రహం..

ప్రభుత్వం మినిస్టీరియల్ ఉద్యోగుల జాబ్ చార్ట్‌కు సంబంధం లేని ఓపీ విధులను కేటాయించడంపై ఏపీ మెడికల్, హెల్త్ మినిస్టీరియల్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు సోమవారం డీఎంహెచ్ఓ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి మక్బూల్ అహ్మద్, ఎస్ నాగేంద్ర మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జాబ్‌చార్ట్‌కు విరుద్ధంగా ఓపీ చీటీల రిజిస్ట్రేషన్ చూడాలని రాష్ట్ర వైద్య సంచాలకులు చెప్పడం సరికాదన్నారు. తమను డీ గ్రేడ్ చేయవద్దని కోరారు. ఇప్పటికే వివిధ రకాల పని ఒత్తిళ్లతో సతమతమవుతుంటే సంబంధం లేని పనులు చేయాలంటే ఎలా? అని మండిపడ్డారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ పనులను పురమాయించడం సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు చేయడానికి వెనుకాడబోమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి సి.నాగరాజు, ఉపాధ్యక్షులు మాధవీలత, షెక్షావలి, రంగనాథ్, శ్రీనివాసులు, కమలాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

– అనంతపురం మెడికల్:



సచివాలయం-1 వద్ద కనిపిస్తున్న నీరు లేని కుండలు

మూన్నాళ్ల ముచ్చట

రుద్రంపేట పంచాయతీ పరిధిలోని సచివాలయం-1 వద్ద ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన చలివేంద్రం మూన్నాళ్ల ముచ్చటగా మారింది. సచివాలయానికి వచ్చే ప్రజలు దాహార్తిని తీర్చుకునేందుకు చలివేంద్రం వద్దకు వెళ్తే ఒట్టి కుండలే దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ప్రజలకు తాగునీటిని అందుబాటులో ఉంచాలని ఆదేశాలు జారీ చేసినా ఫలితం లేకుండా పోతోంది. అధికారులు సచివాలయాల వద్ద తూతూమంత్రంగా చలివేంద్రాలను ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. చాలా చలివేంద్రాల్లో ఖాళీ కుండలే దర్శనమిస్తున్నాయి.

– అనంతపురం రూరల్:

రైతు సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: 'కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తోంది. సబ్సిడీ విత్తనాల కోసం ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. 90 శాతం సబ్సిడీతో అన్ని రకాల విత్తనాలు ఇవ్వాలి. అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం ఒకే దఫా రూ.20 వేలు ఇచ్చి రైతులను ఆదుకోవాలి.' అని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు కాటమయ్య, జిల్లా అధ్యక్షుడు చిన్నప్ప యాదవ్ మాట్లాడారు. రైతుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఖరీఫ్ ప్రారంభమవుతున్నా ఇంత వరకు పంటల వారీగా క్రెడిట్ ప్లాన్, విత్తన ప్రణాళిక ప్రకటించకపోవడం ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమన్నారు. గ్రామసభలు నిర్వహించి భూ యజమాని ప్రమేయం లేకుండా నేరుగా కౌలు రైతులను గుర్తించి కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. పంట ఉత్పత్తి ఖర్చులు పెరిగినందున స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంట రుణాలు ఇవ్వాలని కోరారు. రూ.2 లక్షల వరకు హామీ లేని రుణాలను కౌలు రైతులకు ఇవ్వాలన్నారు. కల్తీ, నాసిరకం విత్తనాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వన్నారెడ్డి, నారాయణస్వామి, వెంకటరాముడు యాదవ్, రామాంజనేయులు, రామకృష్ణ, చలపతి, రామాంజనేయలు యాదవ్, లలితమ్మ, మధుయాదవ్, రమేష్, రాము, మధు, బాషా, గోపాల్, చిన్నకృష్ణుడు, తదితరులు పాల్గొన్నారు.

మురళీనాయక్ త్యాగం చిరస్మరణీయం



టాస్ ఎగురవేస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి

అనంతపురం: ఆపరేషన్ సిందూర్‌లో వీరోచిత పోరాటం చేసి అమరుడైన మురళీనాయక్ త్యాగం చిరస్మరణీయమని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్మీ జవాన్ మురళీ నాయక్ స్మారకార్థం ఆర్ట్స్ కళాశాల మైదానంలో సోమవారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో అత్యధిక స్థాయిలో క్రికెటర్లు భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో అమిటి క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆలమూరు వెంకట శివా రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రతాప్, రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మారుతి ప్రసాద్, సహాయ కార్యదర్శి ఆగిలే జనార్దన రెడ్డి, రాము, మల్లిఖార్జున, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులను సన్మానిస్తున్న ఆయుష్ ఉద్యోగులు

అనంతపురం రూరల్: ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపికృష్ణ, ప్రధాన కార్యదర్శి రాము నాయక్ అన్నారు. సోమవారం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతనంగా ఎన్నికైన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులను ఆయుష్ ఉద్యోగులు సన్మానించారు. ఈ సందర్భంగా గోపికృష్ణ మాట్లాడుతూ.. ఉద్యోగులకు న్యాయపరంగా అందాల్సిన వాటి కోసం పోరాడతామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రూరల్ కమిటీ అధ్యక్షుడు మారుతిప్రసాద్, ఆయుష్ ఉద్యోగులు సత్యప్రసాద్ రావు, సుదర్శన్ రెడ్డి, సుధాకర్, సునీల్, నాగరాజు, ఈశ్వరయ్య, తిమ్మరాజు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భర్తపై భార్య దాడి

అనంతపురం: నగరంలో భవానీ నగర్‌కు చెందిన తిరుపతి నాయుడుపై అతడి భార్య హారిక రాడ్డుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపారు. హారిక.. తిరుపతి నాయుడుకు రెండో భార్య కావడంతో మొదటి వివాహానికి సంబంధించి సోమవారం వాగ్వాదం జరిగింది. కోపంతో ఊగిపోయిన భార్య.. భర్తపై రాడ్డుతో దాడి చేసింది. ఈ సంఘటనలో అడ్డుకోబోయిన వారిపై కూడా దాడి చేయడంతో వారు సైతం గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన తిరుపతి నాయుడుని చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు.

కలెక్టర్ చెబితే వినాలా?

'ఔను! కలెక్టర్ చెప్పినంత మాత్రాన ఆ పని చేయాలని ఎక్కడైనా రూల్ ఉందా?' అనే ధోరణి ఆర్టీసీ అధికారుల్లో వ్యక్తమవుతోంది. ఇందుకు నిదర్శనమే ఈ చిత్రం. ఈ నెల 20న ఆర్టీసీ బస్టాండు, డిపో ప్రాంతాలను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తనిఖీ చేశారు. ఆ సమయంలో ఆర్టీసీ బస్టాండులో నెలకొన్న అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్టాండ్ ఆవరణలో ఎటు చూసినా కనిపిస్తున్న గోతులను తక్షణమే మట్టితో పూడ్చించాలని ఆదేశించారు. ఇక్కడి వరకూ అంతా బాగానే ఉంది. అయితే కలెక్టర్ వచ్చి వెళ్లిన తర్వాత బస్టాండులో మాత్రం ఎలాంటి మార్పులు చోటు చేసుకోలేదు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే నీరంతా గుంతల్లో చేరింది. ఆవరణమంతా అపరిశుభ్రత పేరుకుపోయింది. ఇదంతా చూసిన ప్రయాణికులు.. ఆర్టీసీ అధికారుల్లో మార్పు తీసుకురావడం కలెక్టర్ చేత కూడా కావడం లేదంటూ పెదవి విరుస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



సాగు భూమి కబ్జాకు టీడీపీ నేత యత్నం

- న్యాయం చేయాలంటూ సాగుదారు విజ్ఞప్తి



వినతిపత్రం ఇస్తున్న రైతు లక్ష్మీనారాయణ

రాప్తాడు: గత 32 సంవత్సరాలుగా తాను సాగు చేస్తున్న భూమిని కబ్జా చేసేందుకు టీడీపీ నాయకుడు ప్రయత్నిస్తున్నాడని, ఈ విషయంగా తనకు న్యాయం చేయాలంటూ తహసీల్దార్‌కు సాగుదారు విజ్ఞప్తి చేశారు. బాధిత రైతు తెలిపిన మేరకు... వైఎస్సార్‌సీపీ రైతు విభాగం మాజీ నాయకుడు, రాప్తాడు మండలం పాలబావి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణకు మరూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 403-3లో 4 ఎకరాల భూమికి 1993లో అప్పటి ప్రభుత్వం పట్టా మంజూరు చేసింది. పట్టా ఇచ్చినప్పుడు ఆ పొలం రాళ్ల గుట్టగా ఉండేది. సేద్యం చేసేందుకు ఇబ్బందిగా ఉండడంతో దాదాపు రూ.20 లక్షలకు పైగా ఖర్చు చేసి గుట్టలు తొలగించి అప్పటి నుంచి ఇప్పటి వరకు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో పొలంలో 12 బోర్లు వేయించాడు. ఒక్కదానిలో మాత్రమే నీళ్లు పడ్డాయి. కరెంటు, పైప్‌లైన్ కూడా వేయించుకున్నాడు. 2003లో సుస్థిర వ్యవసాయం కింద బొప్పాయి సాగు చేపట్టాడు. ప్రస్తుతం రెండు ఎకరాల్లో జొన్న, మిగిలిన 3 ఎకరాల్లో వేరుశనగ సాగు చేసేందుకు పొలాన్ని దుక్కి చేశాడు. తన పొలానికి పక్కనే కనగానపల్లి మండలానికి చెందిన టీడీపీ నేత రామ్ శివయ్య కూడా అప్పట్లో 4 ఎకరాలకు సాగు హక్కు పట్టా పొందాడు. అయితే ఆ పొలంలో రాళ్ల గుట్టలు ఉండడంతో ఏనాడూ ఆయన ఆ భూమిలో కాలు పెట్టింది లేదు. ప్రస్తుతం ఆ పొలం పక్కనే సాగులో ఉన్న తన పొలంపై కన్నేసిన రామ్ శివయ్య ఎలాగైనా 2 ఎకరాలను కబ్జా చేసేందుకు పథకం ప్రకారం కుట్రలు సాగిస్తున్నాడని లక్ష్మీనారాయణ ఆరోపించారు. ఈ క్రమంలోనే శివయ్య తన పొలాన్ని కళ్యాణదుర్గంకు చెందిన జయరాములుకు రూ.12 లక్షలకు విక్రయించి, తన రెండు ఎకరాలు శివయ్యకు చెందేలా పొలం హద్దులు సర్వే చేయించుకున్నాడని, ఇది అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ నెల 24న పొలంలో వేరుశనగ విత్తడానికి వెళుతుండగా పోలీసులు జోక్యం చేసుకుని భూమిలోకి వెళ్లొద్దంటూ బెదిరింపులకు దిగుతున్నారని వాపోయాడు. తనకు న్యాయం చేయకపోతే కుటుంబసభ్యులందరూ కలసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకుంటామంటూ సోమవారం తహసీల్దార్ విజయకుమారికి వినతిపత్రం అందజేశారు.

వ్యాపార సముదాయాలకు జరిమానా

అనంతపురం కార్పొరేషన్: రోడ్లపై చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేసే వారిపై నగరపాలక సంస్థ అధికారులు జరిమానాలతో మేలుకొలుపుతున్నారు. కమిషనర్ బాలస్వామి పర్యవేక్షణలోశానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య కార్యదర్శులు సోమవారం నగరంలోని వివిధ కమర్షియల్ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వివిధ షాపులపై రూ.1,42,500 జరిమానా విధించినట్లు కమిషనర్ బాలస్వామి పేర్కొన్నారు. నగర ప్రజలు సామాజిక బాధ్యతగా చెత్తను నగరపాలక సంస్థ వాహనాలకు అందించాలన్నారు. షాపుల ముందు డస్ట్ బిన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయడం సరికాదన్నారు. ప్రస్తుతం తక్కువ మొత్తంలో జరిమానాలు విధిస్తున్నామని, రానున్న రోజుల్లో మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

పారిశుధ్య పనుల పరిశీలన

చెత్తను ఎప్పటికప్పుడు కంపోస్టు యార్డుకు తరలించాలని కమిషనర్ బాలస్వామి సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. సోమవారం నగరంలోని రాంనగర్, కోర్టు రోడ్డు, టవర్‌క్లాక్ రోడ్డు, ఆర్ట్స్ కళాశాల, సాయినగర్, అశోక్‌నగర్, తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. పలు ప్రాంతాల్లో చెత్త తరలింపు జాప్యం జరగడంపై సంబంధిత పారిశుధ్య కార్యదర్శులపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

సంక్షిప్త సమాచారం

వాటర్ డిస్పెన్సర్ వితరణ

అనంతపురం కల్చరల్: తపోవనంలోని వేదమాత గాయత్రీ దేవాలయానికి శ్రీరాం ఆటో మాల్ వారు వాటర్ డిస్పెన్సర్ వితరణ చేశారు. సోమవారం ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సాయిప్రసాద్, అనంత్ చేతుల మీదుగా పరికరాన్ని ఏర్పాటు చేశారు. శాఖ మేనేజర్ రాజేష్ కుమార్, నాగేంద్ర పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం రూరల్: రుద్రంపేట పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీలో పలు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతోందన్నారు. ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. చైతన్య కాలనీ, ఫరుక్‌నగర్‌లకు ప్రధాన రహదారులను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు షేక్ అజాంబాషా, ఆదినారాయణ, క్రిష్ణవేణి, గఫూర్, అక్కులప్ప, నల్లప్ప పాల్గొన్నారు.

కమిటీ వివరాలు తెలియజేయాలి

అనంతపురం అర్బన్: అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తుల జప్తునకు జిల్లాలో ఏర్పాటు చేసిన కమిటీ వివరాలను వెల్లడించకుండా అధికారులు గోప్యంగా ఉంచుతున్నారని అగ్రిగోల్డ్ కస్టమర్లు, ఏజెంటర్ల సంక్షేమ సంఘం నాయకులు మండిపడ్డారు. కమిటీ వివరాలను తెలియజేయాలంటూ కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్‌ను సోమవారం ఆయన చాంబర్‌లో నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కుళ్లాయప్ప, రాజశేఖర్ రెడ్డి, చిన్నప్పయాదవ్, రమణయ్య, ఎల్లుట్ల నారాయణస్వామి, సుందరరాజు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

అనంతపురం టవర్‌క్లాక్: దళితుల భూములు ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత రైతులతో నిరసన తెలిపారు. పామిడి పట్టణ కేంద్రంలో సర్వే నంబర్ 319/1సీ1లో 3.12 ఎకరాల భూమిలో మాల వెంకట చలపతి ఏళ్ల తరబడి సాగులో ఉండగా.. కొందరు కోర్టు ఉత్తర్వుల సాకు చూపి దౌర్జన్యంగా భూమిని ఆక్రమించుకుంటున్నట్లు తెలిపారు. 93 యాక్టు ప్రకారం కోర్టు దళితులకు అనుకులంగా ఆర్డర్ ఇవ్వడం జరిగిందన్నారు. మాల వెంకట చలపతికి ప్రాణహాని ఉందని.. వెంటనే రక్షణ కల్పించాలని కోరారు. త్వరలోనే దళితుల రక్షణ కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

దివ్యాంగుల హక్కుల చట్టం పుస్తకావిష్కరణ

అనంతపురం ఎడ్యుకేషన్: 2016 దివ్యాంగుల హక్కుల చట్టం తెలుగు అనువాద పుస్తకాన్ని సోమవారం గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్ నగరంలో ఆవిష్కరించారు. చాలా చోట్ల దివ్యాంగులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి అనంతపురం జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, న్యాయ సలహాదారుడు ఆనంద్, సుధాకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు లక్షన్న పాల్గొన్నారు.

'పిటీషన్లను చట్ట పరిధిలో పరిష్కరించండి'

అనంతపురం: పిటీషన్లను చట్ట పరిధిలో పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి అన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుండి 90 పిటీషన్లు అందాయి. వీటికి త్వరితగతిన నాణ్యమైన పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భార్యభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై ఫిర్యాదులు అందినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

హంద్రీ-నీవా లైనింగ్ పనులు ఆపాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: హంద్రీ-నీవా అనంత జిల్లా ప్రజల మానసపుత్రిక. హంద్రీ-నీవా కాలువ నీటితో లక్షల ఎకరాలు తడుస్తూ వేల మంది రైతుల కడుపునింతున్నాయి. అలాంటి హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులు ఆపాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు సావిత్రి డిమాండ్ చేశారు. సోమవారం ఆత్మకూరులో విలేకరులతో మాట్లాడారు. లైనింగ్ పనులు పూర్తిగా ఆపి కాలువ వెడల్పు చేయాలన్నారు. పిల్ల కాలువలు ఏర్పాటు చేసి ఆయకట్టు వరకు సాగు నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హంద్రీ-నీవా కాలువ పక్కన పొలాలు ఉన్న రైతుల బోర్లు ఎండిపోకుండా భూగర్భ జలాలు పెరగాలంటే కాలువ లైనింగ్ పనులు తక్షణమే ఆపాలన్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు పంటలు పండక అప్పులు చేసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో లైనింగ్ పనులు చేసి భూగర్భ జలాలు పెరగకుండా చెరువులకు నీరు అందకుండా ప్రభుత్వం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్, రాము, రాజేశ్వరి, జయమ్మ పాల్గొన్నారు.

బైక్‌ల అపహరణ కేసులో ముగ్గురి అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం: నగరంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రి, సాయినగర్ ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను అపహరించుకెళుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు అనంతపురం రెండో పట్టణ సీఐ శ్రీకాంత్‌యాదవ్ తెలిపారు. వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. ఇటీవల రెండో పట్టణ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్న ద్విచక్ర వాహనాల అపహరణ కేసులో దర్యాప్తు వేగవంతం చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో సోమవారం అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డులో నివాసముంటున్న జి.అశోక్ (29 పాత దొంగతనాల కేసుల్లో నిందితుడు), నీరుగంటి వీధికి చెందిన ముంతల సోమశేఖర్ (7 పాత దొంగతనాల కేసుల్లో నిందితుడు), మరువకొమ్మ కొట్టాలకు చెందిన ఎస్.హుస్సేన్‌వలి, ఓ మైనర్‌ని అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.3.30 లక్షలు విలువ చేసే మూడు స్ప్లెండర్ బైక్‌లు, ఓ యాక్టివా స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. మైనర్‌ను జువైనల్ జస్టిస్‌కు తరలించి, మిగిలిన ముగ్గురిని న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు పంపారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని సీఐ శ్రీకాంత్ యాదవ్ అభినందించారు.

పోస్టల్ సేవింగ్స్ ఖాతాలకు ప్రత్యేక శిబిరాలు

అనంతపురం సిటీ: పోస్టాఫీసుల్లో సేవింగ్స్ ఖాతాలు తెరిచేందుకు ఈనెల 31 నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ కె.ఆదినారాయణ, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఉమామహేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోస్టాఫీసుల్లో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతాలు తెరవడం, ఇప్పటికే ఉన్న ఖాతాలకు ఆధార్ లింక్ చేయడం ద్వారా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మ్యాపింగ్ ప్రక్రియ చేయనున్నట్లు వివరించారు. జూన్ 4వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాలు కొనసాగుతాయని వెల్లడించారు. జిల్లాలో ప్రస్తుతం 13,480 లబ్ధిదారులకు ఎన్‌పీసీఐ లింక్ కాని ఖాతాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ పథకాల ఫలాలు లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా జమ అవుతాయని పేర్కొన్నారు.